సాక్షి
ములుగు
శుక్రవారం | 20 | అక్టోబర్ | 2023



విద్యారంగం విధ్వంసం

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని విధ్వంసం చేసిందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ అన్నారు. - IIలో▸



వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. - IIIలో▸

గరిష్టం/కనిష్టం
$37.1^0/29.3^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి సమయంలో మంచు కురుస్తుంది.

జంగ్ తెలంగాణ

అప్పుడు రెడ్లు.. ఇప్పుడు నాయక్‌లు

- కాలంతో మారిన డోర్నకల్ ప్రాతినిధ్యం
- నియోజకవర్గంలో 15సార్లు ఎన్నికలు
- 13సార్లు కాంగ్రెస్‌దే విజయం

ఎన్నికల ఖర్చుపై నిఘా..


- ఒక్కో అభ్యర్థికి రూ.40లక్షల పరిమితి

రూ.25లక్షల నగదు స్వాధీనం

- ఉనికిచెర్ల శివారులో ఎన్‌హెచ్‌పై పోలీసుల తనిఖీలు - IIలో▸

యువత ఓట్లే కీలకం..

- జిల్లాలో 39 ఏళ్లలోపు ఓటర్లు 1,15,176 మంది
- అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేసేది వారే..



వెంకటాపురం(ఎం): శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉంది. గత ఎన్నికల్లో ప్రచారంపై ఆసక్తి చూపని యువత ఈ సారి అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించే స్థితికి చేరుకుంది. ఇంట్లో ఉన్న తల్లిదండ్రులతో పాటు వృద్ధులకు, స్నేహితులకు పార్టీలు, అభ్యర్థులపై అవగాహన కల్పించి అసలుసిసలైన అభ్యర్థికి ఓటేపించి అభివృద్ధికి పాటుపడుదామని చర్చించుకుంటోంది. ఎన్నికలు వచ్చినప్పుడే గుర్తొచ్చే రాజకీయ పార్టీల నేతలను నిలదీసి తమ గ్రామాలను అభివృద్ధి చేసే అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని యువత గర్జిస్తోంది. ఎన్నికల్లో అభ్యర్థులు ఇచ్చే డబ్బులు, మద్యానికి లొంగకుండా గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నారో ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు ప్రజలకు వివరించాలని లేకపోతే ఓటు ద్వారా తగిన బుద్ధిచెబుతామని యువకులు హెచ్చరిస్తున్నారు.

39 ఏళ్లలోపు వారే అధికం..

జిల్లాలోని 9 మండలాల పరిధిలో 2,20,886 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,08,588 మంది పురుషులు, 1,12,277 మంది స్త్రీలు ఉన్నారు. 18 ఏళ్ల నుండి 39 ఏళ్లు ఉన్న ఓటర్లు 1,15,176 మంది ఉన్నారు. జిల్లాలో ఉన్న మొత్తం ఓటర్లలో సగానికంటే ఎక్కువగా యుక్త వయస్సు ఉన్న ఓటర్లే ఉండడం గమనార్హం.

18 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న ఓటర్లు 6,619 మంది ఉండగా 20 నుంచి 29 ఏళ్లలోపు ఉన్న ఓటర్లు 46,384 మంది, 30 నుంచి 39 ఏళ్లలోపు ఉన్న ఓటర్లు 62,173 మంది ఉన్నారు. దీంతో శాసనసభ ఎన్నికల్లో యువత ఓట్లే కీలకంగా మారనున్నాయి. రాజకీయ నేతలు యువతకు గాలం వేసేందుకు ఇప్పటికే క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా సామగ్రి పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల్లో యువత ఎటు వైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాల్సిందే మరి.

అభివృద్ధి చేసేవారికే మొదటి ఓటు



మొదటిసారిగా ఓటుహక్కును వినియోగించుకోబోతున్నాను. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు, పల్లెలను అభివృద్ధి చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వారికే తొలి ఓటు వేస్తాను. ఓటుహక్కు ప్రజలకు, యువతకు వజ్రాయుధం. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

\- కాసం తేజస్విని, వెంకటాపురం(ఎం)

డబ్బు, మద్యం సంస్కృతికి చరమగీతం పాడాలి



ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టే అభ్యర్థులు ఇకనైనా మారాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని ఓటర్లను ప్రలోభపెట్టి వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. రాజకీయ నాయకులు ఇచ్చే డబ్బులు, మద్యం తీసుకోకుండా ప్రజలకు అవగాహన పెంచేవిధంగా అధికారులు కృషి చేయాలి.

\- పంబిడి శ్రీధర్‌రావు, వెంకటాపురం(ఎం)

అమ్మవారికి 108రకాల నైవేద్యం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఏఎస్పీ సంకీర్త్



సాయిబాబా ఆలయంలో అమ్మవారికి 108 ప్రసాదాలు

ఏటూరునాగారం: దేవిశరన్నవరాత్రులలో భాగంగా మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో కొలువైన అమ్మవారికి గురువారం 108 రకాల ఆహార పదార్థాలతో ప్రసాదాలను తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు సుదర్శనస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మేర్గు సత్యం, సభ్యులు పాల్గొన్నారు.

క్రాస్‌రోడ్డులో ఏఎస్పీ పూజలు..

హనుమాన్ సత్సంగ్ కమిటీ వారి ఆధ్వర్యంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సీఐ మండల రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వద్ది నరేష్, మేరుగు హరీశ్, శ్రీరామ్, సురేష్, నాగవత్ కిరణ్, కూరపాటి వేణుగోపాల్, సంతోష్, సాయి, మహేంద్ర చారి, దీపక్, రాజు, పరిపూర్ణం, సమ్మయ్య, మనోహర రాణి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ యాత్రలో అపశ్రుతి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్రలో గురువారం అపశ్రుతి చోటుచేసుకుంది. మాజీ మంత్రి కొండా సురేఖ, ఏఆర్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. భూపాలపల్లి నుంచి కాటారం వరకు బైక్ ర్యాలీలో ద్విచక్ర వాహనం నడుపుకుంటూ వెళ్తున్న సురేఖ కాటారం మండలం కొత్తపల్లి వద్ద అదుపు తప్పి కిందపడింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాటారం సమీపంలోని మల్లంపల్లి క్రాస్ వద్ద విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ నరేష్‌ను కాన్వాయ్ వాహనం ఢీ కొట్టడంతోతోటి సిబ్బంది ఆస్పత్రికి తరలించారు.

న్యూస్‌రీల్

పోటీలకు ఆహ్వానం



భూపాలపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని జిల్లా పరిధిలో విద్యార్థిని, విద్యార్థులకు, యువతి, యువకులకు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌కు జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖారే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21నుంచి 31వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఈ మధ్య కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిల్మ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 23వ తేదీలోపు జిల్లా పోలీసు కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్‌చేసిన పెన్‌డ్రైవ్, 10:8 సైజ్ ఫొటోలను జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 87126 58164 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భూతగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

కాళేశ్వరం: భూతగాదాలతో మనస్థాపానికి చెంది మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన కుంచం ఐలయ్య(50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం.. ఐలయ్యకు తమ బంధువులతో భూతగాదాలు ఉన్నాయి. బుధవారం తమ బంధువుతో గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకొని పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి.. అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడని భార్య పోసక్క ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి



చిట్యాల: రాష్ట్రంలో ప్రజల కష్టసుఖాలను పట్టించుకోని బీఆర్‌ఎస్ పార్టీ, గతంలో రైతుల రాజ్యం తెస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ భరోసా యాత్రలో భాగంగా ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని దుర్గామాత, అయోధ్య రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చల్లగరిగ, జూకల్, తిరుమాలాపూర్, చిట్యాలలో ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం జూకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల కష్టసుఖాలను పట్టించుకోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టోలు వేలంపాటలు పాడినట్లు ఉన్నాయని అన్నారు. ప్రజలు బీజేపీకి ఓటు వేసి భూపాలపల్లిలో కాషాయం జెండా ఎగరవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమౌళి, వెన్నంపల్లి పాపయ్య, చదువు రాంచంద్రారెడ్డి, నిషిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, ఎరుకల గణపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న నాగజ్యోతి

వెంకటాపురం(ఎం): పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా చేసిన అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌ల సమావేశానికి మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి అధ్యక్షత వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు మేడారం జాతర ఊసెత్తని కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల ముందు మేడారం జాతీయ హోదా కల్పిస్తామని మాయమాటలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం ములుగు, గోవిందరావుపేట, వెంకటాపురం మండలాల ఎన్నికల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు మాట్లాడుతూ.. ములుగు గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు అజ్మీరా ధరంసింగ్, మల్క రమేష్, బుర్ర సమ్మయ్య, అశోక్, పోరిక హర్జినాయక్, ఎర్రబెల్లి గోపాల్‌రావు, కూరెళ్ల రామాచారి, పోశాల వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో సమ్మారావు పూజలు

ములుగు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలవాలని కోరుతూ మూడు మండలాల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు గురువారం ఉదయం రామప్పలో పూజలు నిర్వహించారు. 50 వేల మెజార్టీతో నాగజ్యోతి గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జంగ్ తెలంగాణ

కాంగ్రెస్‌లో రెండో రోజు జోష్

ఉమ్మడి జిల్లాలో ముగిసిన రాహుల్ పర్యటన

- భూపాలపల్లి, కాటారంలో బైక్ ర్యాలీలు
- కాటారం కార్నర్ మీటింగ్‌కు భారీగా జనం
- రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాహుల్ స్పష్టీకరణ
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని వెల్లడి



కాటారంలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనసందోహం

భూపాలపల్లి/కాటారం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఉమ్మడి జిల్లాలో జరిగిన రెండు రోజుల పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతను వివరిస్తూ రాహుల్ పర్యటన సాగింది. జనం భారీగా తరలిరావడం.. రాహుల్ ప్రసంగాలకు స్పందన రావడంతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో ఉన్నారు. మొదటి రోజు బుధవారం ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం రామాంజాపూర్‌లో విజయభేరి అనంతరం రాహుల్ రాత్రి భూపాలపల్లి జిల్లాలోని కేటీపీపీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఇక్కడ రాత్రి బస చేసి గురువారం ఉదయమే లేచి టీపీసీసీ అధ్యక్షుడు, పలువురు రాష్ట్ర నాయకులతో కాసేపు సమావేశమై మాట్లాడారు. ఉదయం 10.15 గంటలకు అతిథి గృహం నుంచి కాటారానికి కాన్వాయ్‌లో బయలుదేరారు. వెంట పార్టీ శ్రేణులు బైక్‌లపై అనుసరించారు. కేటీకే 5వ ఇంక్లైన్ క్రాస్‌రోడ్ వద్ద నుంచి బాంబులగడ్డ వరకు కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించగా రాహుల్ కారులోనే ఉండి వ్యాపారులు, పట్టణ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

కార్నర్ మీటింగ్ తరలివచ్చిన జనం..

కాటారం మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ కార్నర్ మీటింగ్ ఉండటంతో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల నుంచి భారీగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కేంద్రానికి తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రధాన కూడలిలో కార్నర్ మీటింగ్ ఉండగా, 6 గంటల నుంచే గ్రామాలనుంచి ప్రజల రాక మొదలైంది. బైక్ ర్యాలీ ఉండడంతో కాంగ్రెస్ యూత్ నాయకులు పెద్ద ఎత్తున బైక్‌లతో తరలివచ్చారు. రాహుల్‌గాంధీకి మేడిపల్లి వద్ద ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. రాహుల్‌గాంధీ కొత్తపల్లి వద్ద బస్సులో నుంచి దిగి రేవంత్‌రెడ్డితో సహా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కాన్వాయ్‌లో ఎక్కి కాటారం చేరుకున్నారు. కాటారం నుంచి మేడిపల్లి వరకు జాతీయ రహదారి మొత్తం కాంగ్రెస్‌మయంగా మారింది. రాహుల్‌గాంధీ సైతం కాటారంలో జనసందోహాన్ని చూసి ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసి తన ప్రసంగంలో జోష్ పెంచారు. ఇక్కడి ప్రజలను చూస్తుంటే కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని సభా ముఖంగా తెలియజేశారు. రాహుల్ హిందీలో ప్రసంగించగా.. శ్రీధర్‌బాబు తెలుగులో అనువదించారు. బీఆర్‌ఎస్, బీజేపీలపై రాహుల్‌గాంధీ గుప్పించిన విమర్శనాస్త్రాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, పక్కన రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు



రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

తెలంగాణలో కేసీఆర్ పని అయిపోయిందని.. ఇక రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. కాటారం మండల కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగిస్తూ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మోదీ కనుసన్నల్లో కేసీఆర్ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం ధోకా పార్టీలని.. కాంగ్రెస్‌ను ఓడించడానికి ఒక్కటయ్యాయని చెప్పారు. ప్రజల కోసం ప్రజా సేవకుడిగా పనిచేస్తానని.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని చెప్పారు.



భూపాలపల్లిలో అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ



భూపాలపల్లి జిల్లాకేంద్రంలో సాగుతున్న ర్యాలీ

‘గెలుపే లక్ష్యంగా పనిచేయాలి’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావు

ములుగు రూరల్: ములుగు నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో నిరుపేదల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నియోజక వర్గంలో విభజన హామీల్లో భాగంగా గిరిజన యూనివర్సిటీని ఆదివాసీల ఆరాధ్య దైవం సమ్మక్క సారలమ్మల పేరున ఏర్పాటు చేయడంతో పాటు రూ.900 కోట్లను కేటాయించారన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, పార్లమెంట్ కో కన్వీనర్ తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, సిరికొండ బలరాం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్, భూక్య జవహర్‌లాల్, రాజు నాయక్, ఉత్తమ్ కుమార్, ఇమ్మడి రాకేష్ యాదవ్, రాకేష్ రెడ్డి, కొత్త సురేందర్, రవి రెడ్డి వాసుదేవరెడ్డి, గట్టు మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్



వెబ్‌లో అభ్యర్థులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: నిరుద్యోగ యువత దొరికిన ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలను పోషించుకోవాలని ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని యూత్ ట్రైనింగ్ కేంద్రాల నుంచి 90 మంది అభ్యర్థులు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్, సోలార్ టెక్నీషియన్ అకౌంట్స్, ఎగ్జిక్యూటివ్ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం మహబూబాబాద్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉద్యోగమేళా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీలు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా ఉద్యోగాల్లో నియామకం చేశారు. అనంతరం ఐటీడీఏ పీఓ అంకిత్ వెబ్ మీటింగ్ ద్వారా ఉద్యోగం పొందిన అభ్యర్థులతో మాట్లాడారు. వేతన వివరాలు, వసతి సదుపాయాల గురించి వారితో చర్చించారు. విధుల్లో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, జేడీఎం కొండలరావు, హైదరాబాద్‌కు చెందిన లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ


వాజేడు: మండల పరిధిలోని వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని డీఎల్‌పీఓ స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆమె గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామ పంచాయతీలు అక్టోబర్ నెలాఖరు నాటికి వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాగారం జీపీ రికార్డుల పరిశీలన

మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీ రికార్డులను ములుగు డీఎల్‌పీవో స్వరూప గురువారం పరిశీలించారు. క్యాష్ బుక్ నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, జనన, మరణాల నమోదు, పెళ్లి ధ్రువీకరణ ఆన్‌లైన్, క్రిమిటోరియమ్, సెగ్రిగేషన్ షెడ్ రిజిస్టర్ నిర్వహణ వంటి వివరాలను పరిశీలించారు. పంచాయతీలో చేపడుతున్న పనులను సెక్రెటరీ ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీవో శ్రీకాంత్ నాయుడు ఉన్నారు.

నష్టాల్లోకి సింగరేణి


భూపాలపల్లి అర్బన్: ట్రాన్స్‌కో, జెన్‌కో, సింగరేణి సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించడం లేదని దీంతో సింగరేణి సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1వ గనిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థకు ఎనిమిదేళ్లుగా ఒకే సీఎండీ పనిచేస్తున్నారని రాష్ట్రంలో సమర్థులైన ఐఏఎస్ అధికారులు లేరా అని ప్రశ్నించారు. సింగరేణి ఓపెన్ కాస్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తుందన్నారు. తాడిచర్ల ఓపెన్ కాస్టు బ్లాక్‌లో కేసీఆర్ కుటుంబ సభ్యుల వాటా ఉందన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇస్తే సింగరేణి కార్మికులను మోసం చేస్తారని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఓపెన్‌కాస్టులను రద్దు చేయడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



మౌలిక సిద్ధాంతాలు ఫణంగా పెట్టి చేసుకునే రాజకీయ సర్దుబాట్లు వ్యవస్థనే విచ్ఛిన్నం చేస్తాయి.
- జవహర్‌లాల్ నెహ్రూ

ఈ ముచ్చటెరికేనా ?

కాళోజీని ఓడించారు..!



హన్మకొండ అర్బన్: 1952లో తొలి సాధారణ ఎన్నికల్లోనే ప్రజాకవి కాళోజీ నారాయణరావు కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి పెండ్యాల రాఘవ రావు చేతిలో 3,613 ఓట్ల తేడాతో కాళోజీ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు.

పంచ్ డైలాగ్



ఓ రాజు, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పోరాటమే ఈ ఎన్నికలు. తెలంగాణతో మాది కుటుంబ బంధం. ఇక్కడి ప్రజల ఉత్సాహం చూస్తుంటే తెలంగాణలో కేసీఆర్ ఓటమి తథ్యం. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం.
- కాటారం కార్నర్ మీటింగ్‌లో రాహుల్‌గాంధీ

ఎమ్మెల్యే 'రెడ్యా' వాహనం తనిఖీ



ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

డోర్నకల్: డోర్నకల్ శివారు అమ్మపాలెం చెక్ పోస్టు వద్ద ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. గురువారం కార్యకర్తలను కలిసేందుకు అమ్మపాలెం వెళ్తున్న ఎమ్మెల్యే రెడ్యా వాహనాన్ని చెక్ పోస్టు వద్ద క్షుణ్ణంగా సోదా చేశారు.

అప్పుడు రెడ్లు.. ఇప్పుడు నాయక్‌లు

కాలంతోపాటు మారిన డోర్నకల్ ప్రాతినిధ్యం

- 15 దఫాలుగా ఎన్నికలు.. ఇందులో 8 సార్లు రెడ్లు, 7 సార్లు నాయక్‌లకు పట్టాభిషేకం
- నియోజకవర్గంలో 13 సార్లు కాంగ్రెస్‌దే విజయం
- ఒకసారి టీడీపీ, గత ఎన్నికలో బీఆర్ఎస్
- నలుగురు ఎమ్మెల్యేలే పాలన

సాక్షి, మహబూబాబాద్:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిట్టచివరి నియోజకవర్గం డోర్నకల్. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడి ఓటర్ల తీర్పు వైవిధ్యంగా ఉంటుంది. నియోజకవర్గ ఏర్పాటు అనంతరం 1957 నుంచి మొదలు.. 2018 వరకు 15 దఫాలుగా ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం జరుగనున్నవి 16వ ఎన్నికలు. అయితే ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం నలుగురు ఎమ్మెల్యేలే ఇక్కడ ఎన్నిక కావడం.. ఇందులో తొలిసారి ఎన్నికైన నూకల రాంచంద్రారెడ్డి నాలుగు సార్లు, ఆయన తర్వాత వచ్చిన రామసహాయం సురేందర్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అనంతరం 2009లో రాథోడ్ సత్యవతి విజయం సాధించారు. మిగిలిన ఐదు సార్లు రెడ్యానాయక్ విజయం సాధించడం గమనార్హం.

13 దఫాలు కాంగ్'రేస్'దే విజయం

చిల్లంచర్ల నుంచి పేరు మార్చుకున్న డోర్నకల్ నియోజకవర్గంలో తొలిసారి 1957 ఎన్నికలు జరిగాయి. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి నూకల రాంచంద్రారెడ్డి, సమీప పీడీఎఫ్ అభ్యర్థి టీ.ఎస్.రావు పై 8,864 ఓట్ల తేడాతో గెలుపొందారు. అనంతరం 1962లో ఇండిపెండెంట్ అభ్యర్థి జేజే రెడ్డిపై, 1967లో స్వతంత్ర అభ్యర్థి వి. లక్ష్మీ నారాయణపై, తర్వాత 1972 ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూకల మరణం అనంతరం జరిగిన 1974 ఉప ఎన్నికలో ఆరంగ్రేటం చేసిన రామసహాయం సురేందర్‌రెడ్డి తొలిసారే ఏకగ్రీవంగా గెలిచి శాసన సభలో అడుగుపెట్టారు. తర్వాత 1978లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన సురేందర్‌రెడ్డి.. కాంగ్రెస్ ఐ అభ్యర్థి వై నర్సింహారెడ్డిపై 13,609 ఓట్ల మెజార్టీతో గెలిచారు. తర్వాత 1983లో కాంగ్రెస్ ఐ నుంచి, 1985లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సురేందర్‌రెడ్డి.. జాన్‌రెడ్డి, జె. జితేందర్‌రెడ్డిపై గెలిచారు. తర్వాత సురేందర్‌రెడ్డి వరంగల్ పార్లమెంట్ నుంచి పోటీ చేయగా.. తనకు ప్రియ శిష్యుడుగా పేరున్న రెడ్యానాయక్‌ను 1989లో డోర్నకల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో దింపారు. ఆ ఎన్నికల్లో సమీప టీడీపీ అభ్యర్థి సత్యవతి రాథోడ్‌పై 5,085 ఓట్ల మెజార్టీతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటి నుంచి రెడ్యానాయక్ 1994, 1999 ఎన్నికల్లో నూకల నరేష్ రెడ్డిపై గెలిచారు. తర్వాత 2004లో టీడీపీ అభ్యర్థి జయంత్‌నాథ్‌పై గెలిచారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన అనంతరం జరిగిన 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సత్యవతి రాథోడ్ చేతిలో 4,623 ఓట్ల తేడాతో రెడ్యానాయక్ ఓటమిపాలయ్యారు. తర్వాత 2014లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన రెడ్యానాయక్, టీఆర్ఎస్ అభ్యర్థి సత్యవతి రాథోడ్‌పై విజయం సాధించారు. తర్వాత టీఆర్ఎస్‌లో చేరిన రెడ్యానాయక్ 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగి సమీప కాంగ్రెస్ అభ్యర్థి రాంచంద్రునాయక్‌పై గెలుపొందారు. ఇప్పుడు జరిగే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థిగా రెడ్యానాయక్ ఏడోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నారు.





నూకల రామచంద్రారెడ్డి / ఆర్. సురేందర్‌రెడ్డి / డీఎస్ రెడ్యానాయక్ / సత్యవతి రాథోడ్

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	వచ్చిన ఓట్లు	ఓడిన అభ్యర్థి	వచ్చిన ఓట్లు
1957	ఎస్.రాంచంద్రారెడ్డి(కాంగ్రెస్)	17,093	టి.ఎస్‌రావు(పీడీఎఫ్)	8229
1962	ఎస్. రాంచంద్రారెడ్డి(కాంగ్రెస్)	25,650	జేజే రెడ్డి(ఇండిపెండెంట్)	18,182
1967	ఎస్. రాంచంద్రారెడ్డి(కాంగ్రెస్)	35,743	వి. లక్ష్మీనారాయణ(ఇండిపెండెంట్)	14,001
1972	ఎస్. రాంచంద్రారెడ్డి(కాంగ్రెస్)	ఏకగ్రీవం		
1974	ఆర్. సురేందర్‌రెడ్డి (కాంగ్రెస్)ఉప ఎన్నిక	ఏకగ్రీవం		
1978	ఆర్. సురేందర్‌రెడ్డి(కాంగ్రెస్)	30,294	వై. నర్సింహారెడ్డి(కాంగ్రెస్.ఐ)	16,685
1983	ఆర్. సురేందర్‌రెడ్డి(కాంగ్రెస్. ఐ)	51,038	జాన్‌రెడి(టీడీపీ)	16,794
1985	ఆర్. సురేందర్‌రెడ్డి(కాంగ్రెస్)	44,387	జె. జితేందర్‌రెడ్డి(టీడీపీ)	29,104
1989	డీఎస్.రెడ్యానాయక్(కాంగ్రెస్)	46,645	సత్యవతి రాథోడ్(టీడీపీ)	41,560
1994	డీఎస్. రెడ్యానాయక్(కాంగ్రెస్)	53,274	నూకల నరేష్‌రెడ్డి(ఇండిపెండెంట్)	27,180
1999	డీఎస్. రెడ్యానాయక్(కాంగ్రెస్)	56,339	నూకల నరేష్‌రెడ్డి(టీడీపీ)	48,303
2004	డీఎస్ రెడ్యానాయక్(కాంగ్రెస్)	72,669	జయంత్‌నాథ్(టీడీపీ)	53,529
2009	సత్యవతి రాథోడ్(టీడీపీ)	69,282	డీఎస్ రెడ్యానాయక్ (కాంగ్రెస్)	64659
2014	డీఎస్.రెడ్యానాయక్(కాంగ్రెస్)	84,170	సత్యవతిరాథోడ్(బీఆర్ఎస్)	60,639
2018	డీఎస్. రెడ్యానాయక్(బీఆర్ఎస్)	88,307	రాంచంద్రునాయక్(కాంగ్రెస్)	70,926

నాయక్‌లకు పట్టాభిషేకం..

ఇప్పటి వరకు 15 దఫాలుగా జరిగిన డోర్నకల్ అసెంబ్లీ ఎన్నికలో కేవలం నలుగురు నాయకులే ఎన్నిక కావడం గమనార్హం. ఇందులో నాలుగు సార్లు నూకల రాంచంద్రారెడ్డి, నాలుగు సార్లు రామసహాయం సురేందర్‌రెడ్డి మొత్తం 8 సార్లు రెడ్డి సామాజిక వర్గం గెలిచింది. అదేవిధంగా 1989 నుంచి 2009 వరకు జనరల్ నియోజకవర్గంగా ఉన్నా..నాలుగు సార్లు గిరిజన అభ్యర్థి రెడ్యానాయక్‌కే నియోకవర్గ ప్రజలు పట్టం కట్టడం గమనార్హం. ఇలా ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా రెడ్యానాయక్, ఒకసారి సత్యవతి మొత్తం ఏడు సార్లు ఈ నియోజకవర్గంలో గిరిజన నాయకులే ప్రాతినిథ్యం వహించారు. అదేవిధంగా ఈ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎన్నికైన నూకల రాంచంద్రారెడ్డి.. దామోదరం సంజీవయ్య, నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నూకల రాంచంద్రారెడ్డి తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. ఫ్రంట్ తరఫున శాసనసభా ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. అదేవిధంగా 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిచిన రెడ్యానాయక్.. వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు.

ఎన్నికల ఖర్చుపై నిఘా..

- పర్యవేక్షణ కోసం షాడో టీమ్‌లు రెడీ
- ఒక్కో అభ్యర్థికి రూ. 40 లక్షల పరిమితి



వర్ధన్నపేట: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు పర్యవేక్షణ కోసం షాడో టీమ్‌లు రెడీ అయ్యాయి. గత ఎన్నికల్లో అభ్యర్థులకు విధించిన వ్యయ పరిమితిని ఎన్నికల సంఘం ఈ దఫా పెంచింది. ఈ క్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.

రూ. 40 లక్షల పరిమితి

గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు పరిమితి రూ. 28 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ. 40 లక్షలకు పెంచారు. ఈ ఖర్చులో అభ్యర్థి వాహనాలు, ప్రచారం నిర్వహించే క్రమంలో ఏర్పాటు చేసే స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, ముఖ్య నేత సభలు, కరపత్రాలు, పోల్ చీటీలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడలపై రాతలు, ఇతరత్రా అన్ని రకాల ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అభ్యర్థికి సంబంధించిన ఖర్చును లెక్కలోకి తీసుకుంటారు.

పక్కాగా వీడియో రికార్డు..

అభ్యర్థి నిర్వహించే ప్రచార సభలు, సమావేశాలు, ప్రచారంలో పని చేస్తున్న ఖర్చులు లెక్కించడానికి ఆయా అభ్యర్థులను అనుసరిస్తూ షాడో టీమ్‌లు పని చేస్తాయి. ఈ టీమ్‌లు అభ్యర్థి ప్రచారం అంశాలను వీడియో రికార్డు చేస్తారు. వీటిని ఆయా అసెంబ్లీ పరిధిలో ఉండే వీడియో వ్యూయింగ్ టీమ్‌లు పరిశీలించి ప్రతి అంశాన్ని లెక్కలోకి తీసుకుని ఖర్చుల లెక్క తయారు చేసాయి. ఈ లెక్కను మళ్లీ అభ్యర్థికి ఇచ్చి ఏమైనా తేడాలు ఉంటే సరి చేసుకోవాలని సూచిస్తాయి. తేడా ఉంటే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అబ్జర్వర్ మొత్తం ఖర్చులను ఆమోదించి నమోదు చేస్తారు.

పకడ్బందీగా పర్యవేక్షణ

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థుల ఖర్చుపై పకడ్బందీ నిఘా ఉంటుంది. ప్రచారంతో పాటు సభలు, సమావేశాల్లో ఎలాంటి ఖర్చు చేశారనే విషయంలో షాడో టీమ్‌లు చేసిన ప్రతి వీడియో రికార్డుల ఆధారంగా ఖర్చులు లెక్క చేసి నమోదు చేస్తాం. ఎన్నికల సంఘం అనుమతించిన వ్యయ పరిమితికి మించి ఖర్చు చేయడానికి వీలులేదు.

-విజయసాగర్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వర్ధన్నపేట

కాంగ్రెస్ కండువా కప్పుకున్న 'రేవూరి'



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనలో పాల్గొన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి. -నర్సంపేట


రూ. 25 లక్షల నగదు స్వాధీనం..



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

ధర్మసాగర్: మండలంలోని ఉనికిచర్ల శివారు జాతీయ రహదారిపై గురువారం కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో మోఘా కంపెనీకి చెందిన ఉద్యోగులు నాగేశ్వర్ రావు, గుండు శేఖర్ ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 25 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డబ్బును స్టేషన్ ఘన్‌పూర్ త్రిమెన్ కమిటీకి అప్పగించారు.

బీ-ఫామ్‌ల అందజేత





బీఫామ్ అందుకుంటున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం శ్రీహరి

పాలకుర్తి టౌన్/స్టేషన్‌ఘన్‌పూర్: పాలకుర్తి నియోజవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గురువారం బీ-ఫామ్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ బీఫామ్ అందించారు. సీఎం కేసీఆర్.. దయాకర్‌రావుకు, కడియం శ్రీహరికి శుభాకాంక్షలు చెప్పి గెలిచి రావాలని ఆశీర్వదించారు.

ఏసీబీ వలలో అవినీతి చేప

- రూ.15వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన పరిశ్రమలశాఖ అధికారి శ్రీనివాస్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన జీఎం శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: ఏసీబీ వలలో ఓ అవినీతి చేప చిక్కింది. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గంగాధర శ్రీనివాస్ రూ.15 వేల లంచం తీసుకుంటూ గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం ములుగు జిల్లా మల్లంపల్లి శివారు శ్రీనగర్‌కు చెందిన గుగులోత్ లచ్చిరాం ఉపాధి నిమిత్తం టీప్రైడ్ పథకం ద్వారా ఓ లారీని కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకున్నాడు. లారీ విలువ రూ.53 లక్షలు ఉండగా అందులో ప్రభుత్వం రూ.23 లక్షల సబ్సిడీ అందిస్తుంది. దీని కోసం గత సంవత్సరం దరఖాస్తు చేసుకున్న లచ్చిరాం.. కొంతకాలంగా పరిశ్రమల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అన్ని సర్టిఫికెట్లను జీఎం శ్రీనివాస్‌కు అందజేశాడు. అయితే జీఎం శ్రీనివాస్ నేరుగా లచ్చిరాంను రూ.1.10 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ముందు రూ.50 వేలు అప్పగించారు. అయితే మిగతా రూ.60వేలు ఇచ్చే క్రమంలో బాధితుడు ఆలస్యం చేస్తుండగా జీఎం శ్రీనివాస్ ఒత్తిడి తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో లచ్చిరాం ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అనంతరం జీఎం శ్రీనివాస్‌తో మాట్లాడి మిగతా రూ.60 వేలలో ముందు రూ.15వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అప్పటికే ప్రణాళిక ప్రకారం బాధితుడు ఏసీబీ అధికారులకు ముందే సమాచారం ఇవ్వడంతో వారు కార్యాలయం వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో బాధితుడు రూ.15 వేలు ఇవ్వడానికి కార్యాలయం లోపలికి వెళ్లాడు. అక్కడ డబ్బు తీసుకున్న జీఎం తన డెస్క్‌లో వేయగా వెంటనే ఏసీబీ అధికారులు లోపలికి వచ్చి తనిఖీ చేశారు. జీఎం వద్ద రూ.15 వేలు లభించగా అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాస్‌ను 48 గంటల్లో హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

బాధితులు సమాచారం ఇవ్వాలి..

అధికారులు లంచం డిమాండ్ చేస్తే బాధితులు తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ మేరకు తమ ఫోన్ నంబర్లు, టోల్ ఫ్రీ నంబర్లను ప్రకటించారు. టోల్ ఫ్రీ నంబర్ 1064, డీఎస్పీ సాంబయ్య సెల్ నంబర్ 9154388912, ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, రవి, శ్రీనివాస్ నంబర్లు 9154388913, 9154388914, 9154388915 సమాచారం ఇవ్వాలన్నారు.

రాష్ట్రంలో విద్యారంగం విధ్వంసం

- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ

కేయూ క్యాంపస్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని విధ్వంసం చేసిందని, ఈ దుర్మార్గపు పాలకులను ఓడిస్తేనే విద్యాసంస్థలు బాగు పడుతాయని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ అన్నారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం ముసుగులో ప్రభుత్వం విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. కేజీటూపీజీ ఉచిత విద్య అని చెప్పి అధికారంలోకి వచ్చాక 5 శాతం విద్యార్థులకు ఉపయోగపడేలా వివిధ గురుకులాల సంఖ్య పెంచి మిగతా 95 శాతం ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పేద విద్యార్థులకు విద్యకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు మల్లారెడ్డి,అనురాగ్‌లాంటి ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. వర్సిటీల్లో కూడా నాణ్యమైన విద్యనందించడం లేదన్నారు. నిధుల లేమితో వర్సిటీలు కునారిల్లుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు చేపట్టలేదన్నారు. మరోవైపు యూనివర్సిటీలకు అసమర్థ వీసీలను నియమించారని ఆరోపించారు. దీంతో వర్సిటీల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందన్నారు. ట్రిపుల్‌ఐటీ(బాసర)లో అనేక సమస్యలతో విద్యార్థులు ఆందోళనలు చేశారన్నారు. అయినా ఇప్పటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈ అంశాలను గుర్తించి యువత ముందుకెళ్లాలన్నారు. కుమారస్వామి, క్రాంతికుమార్, ప్రవీణ్, కేయూ జాక్ వ్యవస్థాపకుడు మంద వీరస్వామి పాల్గొన్నారు.

రూ. 2.32 లక్షల మద్యం పట్టివేత

- ఒకరి అరెస్ట్.. వ్యాపారిపై కేసు



నిందితుడు, పట్టుబడిన మద్యంతో పోలీసులు

ఖిలా వరంగల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. 2.32 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ బారీ తెలిపారు. ఈ మేరకు గురువారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ బోనాల కిషన్, సీఐ సురేష్ గౌడ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సుగుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం అర్ధరాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఖమ్మం జిల్లాకు చెందిన మొలగుండ్ల పార్థసారథి తన కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్నాడు. దీంతో పార్థసారథిని అదుపులోకి తీసుకుని కారుతోపాటు రూ. 2.32 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తితోపాటు సుబేదారిలోని తెలంగాణ వైన్స్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ చెప్పారు. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం నిల్వ చేసినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు శ్రీలత, వెంకన్న ,పున్నం, కానిస్టేబుళ్లు వీరన్న , కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

- రూ.78,420 నగదు, 4 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం
- పోలీసు అదుపులో నలుగురు పేకాటరాయుళ్లు



పట్టకున్న నగదును చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ దేవేందర్

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి రూ.78,420 నగదు, 4 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ. మధుసూదన్ తెలిపారు. మిల్స్‌కాలనీ పీఎస్ పరిధి శివనగర్‌లోని సిక్కుల వీధిలో గురువారం మధ్యాహ్నం ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఇంటిపై దాడి చేసి శివనగర్‌కు చెందిన కలకోట్ల శ్యామ్, రేగురి నాగరాజు, పొట్లపల్లి నిశాంత్‌బాబు, కందుల యాదగిరిరి ఆదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 78,420 నగదు, 4 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నలుగురిపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ సీఐ సురేష్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

మామునూరు పీఎస్ పరిధిలో..

మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి గుంటూరుపల్లి శివారులో ఓ పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ దేవేందర్ ఆధ్వర్యంలో గురువారం దాడి చేశారు. ఈదాడిలో శివనగర్‌కు చెందిన ఉర సాంబరాజు, కొడమంచి పోచయ్య, గుంటూరు పల్లికి చెందిన పాతి మహేష్ అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.32 వేల నగదు, 3 స్మార్ట్‌ఫోన్లు, 4 బైకులు స్వాధీనం చేసుకున్నామని సీఐ దేవేందర్ తెలిపారు. అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేసి మామునూరు సీఐ క్రాంతికుమార్‌కు అప్పగించామని దేవేందర్ తెలిపారు. కాగా, గుంటూరుపల్లికి చెందిన శివ, పస్తం రవీందర్ పరారయ్యారన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు కిరణ్, దయాసాగర్, కరుణాకర్ పాల్గొన్నారు.

కేఎంసీలో ర్యాగింగ్ నివారణకు చర్యలు

- 20 మంది విద్యార్థులకు జరిమానా
- సైఫ్ వివరణకు నోటీసులు
- హాస్టళ్లకు సెక్యూరిటీ పెంచాం: కేఎంసీ ప్రిన్సిపాల్

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. సెప్టెంబర్ 14న రాత్రి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఫస్టియర్ విద్యార్థి మనోహర్‌పై దాడి చేసిన ఏడుగురు విద్యార్థులను మూడు నెలల పాటు సస్పెండ్ చేయగా.. మరో 20 మంది విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ నిర్ణయం మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనోటీసులపై వివరణ తీసుకున్న కేఎంసీ ప్రిన్సిపాల్ ఒక్కో విద్యార్థికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో ర్యాగింగ్ జరగకుండా తీసుకున్న చర్యలను ఆయన వివరించారు.

పకడ్బందీ చర్యలు

- కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని హాస్టళ్లకు గతంలో ముగ్గురు సెక్యూరిటీగార్డులు ఉండగా.. ప్రస్తుతం ఆసంఖ్యను ఏనిమిదికి పెంచారు.
- కేఎంసీలో సాయి కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ ద్వారా మరో 30 మంది సెక్యూరిటీగార్డులు విధులు నిర్వర్తిస్తారు.
- కేఎంసీ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు రాత్రి వేళల్లో బర్త్‌డే పార్టీలు, ఇతరత్రా పార్టీలు చేసుకోకుండా నిబంధనలు విధించారు.
- రాత్రి వేళలో విద్యార్థులు సంచరించకుండా సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు.
- నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ విద్యార్థులకు సైకాలజిస్ట్ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చారు.
- ప్రీతి ఘటనలో ర్యాగింగ్ జరిగిందని నిర్ధారించబడిన సైఫ్‌కు కోర్టు ఉత్తర్వుల మేరకు వారం రోజుల తర్వాత నోటీసు జారీ చేశారు.
- ఐదు రోజుల క్రితం అందించిన నోటీసులకు సైఫ్ 14 రోజుల్లో వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

వర్క్ ఆర్డర్స్ త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



కాజీపేట అర్బన్ : రెండు సంవత్సరాలు పైబడిన వర్కర్ ఆర్డర్స్ త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గురువారం డైరెక్టర్లు, ఎస్ఈ, డీఈ,ఎస్ఏవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కెపాసిటర్ బ్యాంక్‌లను సరి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, వినియోగదారులతో సంబంధాలు మెరుగుపరచుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డిపార్ట్‌మెంట్ వాహనాల్లోనే తరలించాలన్నారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని, నూరుశాతం రెవెన్యూ వసూళ్లు సాధించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, గణపతి, సంధ్యారాణి, మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సదర్‌లాల్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా అశోక్‌కుమార్



అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రేషన్ సిబ్బంది

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ వరంగల్ ఆడిట్ విభాగం జిల్లా ఇన్‌చార్జ్(ఎఫ్ఏసీ) రిజిస్ట్రార్‌గా సీహెచ్.అశోక్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ తులసి హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ కాగా, ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ ఎఫ్ఏసీగా వరంగల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్లు రాజు, అంజద్‌అలీ, సిబ్బంది శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక.. విద్యార్థి ఆత్మహత్య



శంషాద్దీన్ (ఫైల్)

దంతాలపల్లి: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దాట్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శంషాద్దీన్(21)హనుమకొండలో ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు దసరా సెలవులు రావడంతో ఇటీవల ఇంటికి వచ్చాడు. హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక.. ఎవరితో చెప్పకొలేక తీవ్ర మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి షేక్ మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

నర్సింహులపల్లిలో పురుగుల మందు తాగి యువకుడు..

శాయంపేట : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నర్సింహులపల్లిలో జరిగింది. పరకాలకు చెందిన గూడూరు రాజు, సునీత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రాము (30) టైలర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజుకు గతేడాది ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో రాముపై ఆర్థిక భారం పడగా అతను మద్యానికి బానిసయ్యాడు. దీనిపై తల్లిందండ్రులు మందలించారు. దీంతో ఈనెల 18వ తేదీన గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించగా వారు వెంటనే పరకాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

అసెంబ్లీ బరిలో మొదటి నుంచి మహిళలు..

మొదటి కాంగ్రెస్ మహిళా అభ్యర్థి రాజ్యలక్ష్మి

- నర్సంపేటలో పాగా వేసిన కనకరత్నమ్మ
- 1967లో చెన్నూరు ఎమ్మెల్యేగా ఎన్.విమలాదేవి
- 2009 ఎన్నికల్లో అసెంబ్లీకి నలుగురు మహిళలు
- 2014లో మహిళలకు కలిసిరాని విజయం
- 2018లో ములుగులో పాగా వేసిన సీతక్క



ఉమ్మడి జిల్లా నైసర్గిక స్వరూపం



ఎన్.విమలాదేవి సత్యవతిరాథోడ్ ధనసరి సీతక్క కొండా సురేఖ మాలోతు కవిత శారారాణి

సాక్షిప్రతినిధి, వరంగల్: చట్టసభల్లో తమ గొంతును వినిపించేందుకు మహిళానేతలు చేసిన ప్రయత్నం ఈనాటిది కాదు. రిజర్వేషన్లు, కోటాల ప్రతిపాదనలు లేక ముందే ఎమ్మెల్యేలుగా గెలుపొందేందుకు ప్రయత్నించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ జిల్లాలో మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి మొదటి సారిగా అవకాశం కల్పించింది. అప్పటినుంచి అన్ని పార్టీలు మహిళలకు టికెట్లు ప్రోత్సహించే ప్రయత్నం చేసినా కొందరిని విజయం... మరికొందరిని అపజయం వరించింది. 1957 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై జిల్లా నుంచి గెలుపొందిన మొదటి మహిళా ఎమ్మెల్యేగా కె.కనకరత్నమ్మ శాసనసభలో అడుగుపెట్టారు. 2009 ఎన్నికల నాటికి మహిళా ఎమ్మెల్యేల సంఖ్య నాలుగుకు చేరింది. 2014లో డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్ పశ్చిమ నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి ముగ్గురు మహిళలకు అవకాశం రాగా అందరూ ఓటమి చెందారు. 2018లో పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, ములుగుల నుంచి ముగ్గురు మహిళలు (కొండా సురేఖ, శనిగరపురం ఇందిర, ధనసరి సీతక్కలు) పోటీ చేయగా, సీతక్క గెలుపొందగా ఇద్దరు అపజయం పొందారు.

మొదటిసారిగా ములుగు నుంచి మహిళకు కాంగ్రెస్ అవకాశం.....

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో మొదటిసారిగా ములుగు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మహిళకు టికెట్ ఇచ్చింది. ఎస్.రాజ్యలక్ష్మికి కాంగ్రెస్ టికెట్ లభించగా ఆమెపై పీడీఎఫ్ అభ్యర్థిగా హనుమంతరావు పోటీ చేశారు. 1952లో ములుగు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 50,076 మంది కాగా, 23,689 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి హనుమంతరావుకు 7,132 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.రాజ్యలక్ష్మికి 6,540 ఓట్లు వచ్చాయి. 592 ఓట్ల ఆధిక్యతతో పీడీఎఫ్ అభ్యర్థి విజయం సాధించారు. తిరిగి 2004లో ములుగు నియోజకవర్గంనుంచి టీడీపీ తరఫున ధనసరి అనసూయ(సీతక్క)కు అవకాశం కల్పించగా కాంగ్రెస్ అభ్యర్థి పోదెం వీరయ్య గెలుపొందారు. 2009 ఎన్నికల్లో టీడీపీ టికెట్‌పై పోటీ చేసిన ధనసరి అనసూయ ..కాంగ్రెస్ పోదెం వీరయ్యపై విజయం సాధించారు. 2018లో ఆజ్మీర చందూలాల్ పోటీ చేసినా సీతక్క గెలుపొందారు.

మహిళలకు వరంగల్ నుంచి ఒక్కసారి, స్టేషన్‌ఘన్‌పూర్ రెండు సార్లు..

వరంగల్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2004 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గుండు సుధారాణికి టీడీపీ అవకాశం కల్పించింది. 15 పర్యాయాలు ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగితే రెండుసార్లు మాత్రమే మహిళలకు పోటీ చేసే అవకాశం వచ్చింది. 2004లో గుండు సుధారాణిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బస్వరాజు సారయ్య విజయం సాధించారు. 2009లో మరోసారి ఆమెకు పోటీ చేసే అవకాశం ఉన్నా టీఆర్ఎస్‌తో కుదుర్చుకున్న పొత్తుల ఒప్పందం కారణంగా సుధారాణికి టికెట్ లభించలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి 1972లో సీపీఐ పార్టీ తరపున ఏకే.దేవి పోటీ చేయగా, కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన టి.హయగ్రీవాచారి గెలుపొందారు. కాగా 1962లో హసన్‌పర్తి(హనుమకొండ)నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ మహిళా అభ్యర్థి కె.రత్నమ్మకు టికెట్ ఇవ్వగా ఆమెపై స్వతంత్ర అభ్యర్థి సీహెచ్ వాసుదేవరెడ్డి విజయం పొందారు. తిరిగి 2018లో శనిగపురం ఇందిరకు కాంగ్రెస్ అవకాశం కల్పించగా ఓటమి చెందింది.

జనగామ, వర్ధన్నపేట, పశ్చిమలో వరించని విజయం..

జనగామ నియోజకవర్గానికి 15 సార్లు, వర్ధన్నపేటకు 16 సార్లు ఎన్నికలో జరిగితే ఆ రెండు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్, టీడీపీల నుంచి ఒక్కోసారి పోటీ చేసే అవకాశం లభించింది. ఆ రెండు స్థానాల నుంచి ఒక్కోసారి మహిళలకు టికెట్లు లభించినప్పటికీ వారిని విజయం వరించలేదు. 1999లో టీడీపీ అభ్యర్థిగా జి.ప్రేమలతారెడ్డి ఆ పార్టీ అధిష్టానం ఎన్నికల బరిలో నిలపగా, కాంగ్రెస్ పార్టీ తరపున పొన్నాల లక్ష్మయ్య పోటీలో ఉండటంతో ఆమె తుదివరకు పోరాడింది. ఆ ఎన్నికల్లో పొన్నాల లక్ష్మయ్యకు 60,041 ఓట్లు లభించగా, ప్రేమలతారెడ్డికి 36,253 రాగా లక్ష్మయ్య విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ మహిళా అభ్యర్థి ఎర్రబెల్లి స్వర్ణకు అవకాశం కల్పించింది. టీడీపీ అభ్యర్థిగా ఎర్రబెల్లి దయాకర్‌రావు పోటీలో నిలిచి స్వర్ణపై 11 వేల పైబిలుకు ఓట్లతో విజయం సాధించారు. అలాగే వరంగల్ పశ్చిమ నుంచి 2010 ఉప ఎన్నిక, 2014 సాధారణ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అవకాశం ఎర్రబెల్లి స్వర్ణకు దక్కగా, బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ చేతిలో ఓటమి చెందారు.

2009లో నలుగురు మహిళా ఎమ్మెల్యేలు..

1952 అసెంబ్లీ ఎన్నికలనుంచి తరచుగా మహిళలకు పోటీచేసే అవకాశం లభించినా జిల్లా నుంచి మెజార్టీగా మహిళా ఎమ్మెల్యేలు 2009లో శాసనసభలో అడుగుపెట్టారు. పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ముచ్చటగా మూడో సారి కొండా సురేఖ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లారు. ములుగు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పోదెం వీరయ్యపై ఓటమి చవిచూసిన ధనసరి అనసూయ(సీతక్క) తిరిగి అతనిపైనే విజయం సాధించి అసెంబ్లీలో కాలుమోపారు. డోర్నకల్‌లో 1989 కాంగ్రెస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్‌పై టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఐదు వేల పైబిలుకు ఓట్ల తేడాతో ఓటమి చెందిన సత్యవతిరాథోడ్‌కు.... 2009లో రెడ్యానాయక్‌పై గెలుపొంది శాసనసభకు వెళ్లే అవకాశం దక్కింది. తండ్రి డీఎస్ రెడ్యానాయక్‌ను స్ఫూర్తిగా తీసుకొని 2009లో కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన మాలోతు కవిత మహబూబాబాద్ నుంచి గెలుపొందారు. మొత్తానికి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలకు నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం మహిళా స్ఫూర్తికి నిదర్శనం.

నర్సంపేటలో ఎమ్మెల్యేగా పాగా వేసిన కె.కనకరత్నమ్మ..

1957 ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంనుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కె.కనకరత్నమ్మకు అవకాశం కల్పించింది. పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎ.వెంకటేశ్వర్‌రావు ఆమెపై 2,701 ఆధిక్యత సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కనకరత్నమ్మకు 15,707 ఓట్లు వస్తే వెంకటేశ్వర్‌రావుకు 13,003 ఓట్లు వచ్చాయి. 1957 ఎన్నికలు మినహాయిస్తే నర్సంపేట నుంచి మహిళలకు ప్రాతినిధ్యం దక్కలేదు. 1967లో చెన్నూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎన్.విమలాదేవి.. సీపీఎం అభ్యర్థి ఎన్.నర్సింహులుపై విజయం సాధించారు. విమలాదేవికి 26,940 ఓట్లురాగా, నర్సింహులుకు 20,204 ఓట్లు వచ్చాయి. తిరిగి 1972లో జరిగిన ఎన్నికల్లో విమలాదేవి ఇండిపెండెంట్ అభ్యర్థి కె.మధుసూదన్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు.

పరకాల, శాయంపేటలో మహిళలకు ఆదరణ...

శాయంపేట, పరకాల నియోజకవర్గాల ఓటర్లు మహిళా అభ్యర్థులను ఆదరించారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు, తర్వాత ఈ నియోజకవర్గాల నుంచి ఒకటి కంటే ఎక్కువ పర్యాయాలు మహిళా అభ్యర్థులు గెలుపొందే అవకాశం దక్కింది. 1999లో శాయంపేట నియోజకవర్గంనుంచి కాంగ్రెస్ టికెట్‌పై బరిలో నిలిచిన కొండా సురేఖ.. బీజేపీ అభ్యర్థి జి.ప్రేమేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థికి 72,454 ఓట్లు రాగా, ప్రేమేందర్‌రెడ్డికి 28,430 ఓట్లు వచ్చాయి. 2004 ఎన్నికల్లో రెండవ సారి పోటీలో నిలిచిన కొండా సురేఖ బీజేపీ అభ్యర్థి దేవు సాంబయ్యపై 384 ఓట్లతో గెలుపొందారు. 1999లో ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ పుల్లా పద్మావతికి లభించగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బొజ్జపెల్లి రాజయ్య చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన బండారి శారారాణి .. టీడీపీ అభ్యర్థి డి.సాంబయ్యపై గెలుపొదారు. ఆ ఎన్నికల్లో శారారాణికి 71,773 ఓట్లు రాగా, సాంబయ్యకు 37,176 ఓట్లు వచ్చాయి. ఇదిలా ఉండగా నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా శాయంపేట నియోజకవర్గం అంతర్ధానం కావడంతో 2009లో జరిగిన ఎన్నికల్లో పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా సురేఖ టీఆర్ఎస్ అభ్యర్థి మొలుగూరి భిక్షపతిపై విజయం సాధించారు. అయితే 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సురేఖ ఇక్కడే ఓటమి చెందారు.

ఏడొద్దులకే సద్దుల బతుకమ్మ!



పెద్దమడూరులో బతుకమ్మలతో మహిళలు (ఫైల్)

దేవరుప్పుల: సాధారణంగా తొమ్మిది రోజులకు నిర్వహించే సద్దుల బతుకమ్మను దేవరుప్పుల మండలంలోని రెండు గ్రామాల్లో ఏడో రోజే నిర్వహిస్తున్నారు. ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. నిజాం కాలం కంటే ముందు పెద్దమడూరు, ధర్మగడ్డ గ్రామాల్లో ఓ ఏడాది సద్దుల బతుకమ్మ నాడు పలు వాడల్లో నిప్పంటుకుంది. నివాసిత గుడిసెలు కాలిపోయాయి. గౌరమ్మను సాగేనంపలే రోజు ఊరికి అగ్గి రాజుకుందని.. ఇది ఊరికి అరిష్టమని అప్పటి బ్రాహ్మణులు మరుసటి ఏడాది నుంచి ఏడో రోజున సద్దుల బతుకమ్మ నిర్వహించడం ప్రారంభించారు. అప్పట్నుంచి ఈగ్రామాల్లో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహిస్తూ వస్తున్నారు. కాగా.. ఇక్కడి ఆడపడుచులకు ఏడాదికి రెండుసార్లు(పుట్టింట్లో, మెట్టింట్లో) సద్దుల బతుకమ్మ ఆడే అరుదైన అవకాశం దక్కుతోంది. కాగా.. శుక్రవారం ధర్మగడ్డ, పెద్దమడూరులో సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు.

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం

- ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకుడు రవినాయక్



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి మధురిమ

హసన్‌పర్తి: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకుడు రవినాయక్ సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యారణ్యపురి,లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం హసన్‌పర్తి మండలం మడిపల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారి మధురిమ ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ చిర్ర సుమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, సభ్యులు రాజేందర్, సాంబయ్య, మలహాల్‌రావు డాక్టర్ శోభారాణి, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం




సుదర్శన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న డీఎంహెచ్ఓలు

ఎంజీఎం : వైద్య, ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బి.సాంబశివరావు, కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్‌కు పేషెంట్‌కు మధ్య ఫార్మసిస్టులు వారధి లాంటి వారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఫార్మసిస్టులు ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించారని కొనియాడారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బత్తిని సుదర్శన్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పు భాస్కర్‌రావు, ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ మెంబర్ రాపోలు సత్యనారాయణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడప వెంకటరమణ, కార్యదర్శి దేవంభట్ల ప్రకాష్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అవినాష్, నాయకులు సత్యం, నార్ల వేణు, వినోదర్, శ్రీనివాస్, సదయ్య, యాదయ్య, మమత, బాబురావు, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ, శేషవాహన సేవలు



వేయిస్తంభాల ఆలయంలో అమ్మవారికి లక్షపుష్పార్చన చేస్తున్న అర్చకులు



భద్రకాళి అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు



స్కందమాతా అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : దేవీశరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు భద్రకాళి దేవాలయంలో అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరీ (లలితా)దేవీగా అలంకరించి స్కందమాత క్రమంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీసేవ నిర్వహించారు. సాయంత్రం శేష వాహనంపై ఊరేగించారు. తెలంగాణ జోన్ అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ కమిషనర్ విశాలి దయాళ్, వరంగల్ రీజినల్ పీఎఫ్ కమిషనర్ ప్రణీల్‌జోషి, రవికుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈఓ శేషభారతి పర్యవేక్షించారు.

లలితా మహాత్రిపుర సుందరిదేవీగా అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం ఐదో రోజు వేయిస్తంభాల దేవాలయంలో అమ్మవారిని లలితా మహాత్రిపుర సుందరిదేవీగా అలంకరించారు. ఆలయప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో నిత్యాహ్నిక పూజలు జరిపి అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీపై ఊరేగించారు. భవానీదేవి ఉత్సవవిగ్రహాన్ని లలితా మహాత్రిపుర సుందరిదేవీగా అలంకరించారు. నీలం సుహాస్ దంపతులు, కిశోర్ దంపతులు ఉభయ దాతలు వ్యవహరించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిగింది.

స్కందమాతా అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

హన్మకొండ అర్బన్: నగరంలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో అమ్మవారు భక్తులకు స్కంద మాతా(ఉపాంగ లలిత) అలంకరణలో దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకర్ శర్మ తెలిపారు. అనంతరం అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని, పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. కాగా పద్మాక్షి అమ్మవారిని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్ హామీలను ప్రజలు విశ్వసించరు

- రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎర్రబెల్లి ఫైర్
- బీఆర్ఎస్ కృషితోనే ములుగు, భూపాలపల్లి అభివృద్ధి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర: దశాబ్దాలుగా తెలంగాణను విస్మరించిన కాంగ్రెస్ పాలకులు ప్రస్తుత ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించరని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు అన్నారు. గురువారం పెద్దవంగర మండలం పోచంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాటారంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఫైర్ అయ్యారు. ప్రత్యేక తెలంగాణలో సీఎం కేసీఆర్ హయాంలో ములుగు, భూపాలపల్లి జిల్లాల ఏర్పాటుతో సమగ్రాభివృద్ధికి బాటలు పడ్డాయని అన్నారు. ములుగులో మెడికల్ కళాశాల, గిరిజన విశ్వవిద్యాలయానికి శ్రీకారం చుట్టామన్నారు. కాంగ్రెస్ హయాంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ హోదాను విస్మరించిందని, ఇప్పుడు హోదా కల్పిస్తామని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు తప్ప రేవంత్‌రెడ్డి ఆచరణాత్మక అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. అందుకే నిల్చున్న చోట నిలబడని దౌర్భాగ్యంతో ఎన్నికలొస్తే మరోచోటకు వెళ్తాడని విమర్శించారు. నాడు ఓటుకు నోటుతో టీడీపీని.. నేడు ఎమ్మెల్యే టికెట్ల వేలంతో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. 'రేవంత్... నన్ను దద్దమ్మ అంటావా? నీలాగా బ్రోకర్ మాటలు నాకు రావు.. మాట నిలబెట్టుకొనే ప్రజాసేవకుడిగా నన్ను ప్రజలు ఏడుసార్లు చట్టసభల్లో నిలిపారని' ఎర్రబెల్లి అన్నారు. బ్రోకరిజం చేసి జైలుకు పోయివచ్చినోని మాటలు నమ్మి రాసిచ్చిన కాగితం చదివితే ఇక్కడి అభివృద్ధి రాహుల్‌గాంధీని అర్థంకాదని, కాళేశ్వరం ప్రాజెక్టు, సింగరేణి అభివృద్ధిని చూసి మాట్లాడితే అర్థం ఉంటుందన్నారు. మీ 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ప్రాజెక్ట్ ఎక్కడైనా కట్టారా..?అని ప్రశ్నించారు.

ఇస్రోను సందర్శించిన విద్యార్థులు



ఇస్రోను సందర్శిస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీ విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్సీ– ఇస్రో ఔట్‌రిచ్ ఫెసిలిటీని సందర్శించారు. ఇండస్ట్రియల్ శిక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి పరిశీలన, సాంకేతికత అభివృద్ధిలో ఎన్ఆర్ఎస్సీ పాత్ర, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణపై అవగాహన కల్పించినట్లు ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్ తెలిపారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీ



స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసులు

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ, సీబీబీ సిబ్బంది గురువారం తనిఖీలు చేపట్టి సుమారు రూ. 54 లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకుంది. స్టేషన్‌లోని రెండో ప్లాట్ ఫామ్‌లో తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన బి సీతారామన్ వద్ద సుమారు కేజీ బంగారం లభ్యం కాగా స్వాధీనం చేసుకుంది. కాగా, సీతారామన్.. వరంగల్‌లోని పలు బంగారు దుకాణాలకు సరఫరా చేసేందుకు ఆధారం లేకుండా సుమారు కేజీ బంగారం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కమర్షియల్ టాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్ సునీల్ రెడ్డికి అప్పగించామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయి



మాట్లాడుతున్న సాంబశివరావు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

హసన్‌పర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు క్రాస్‌లోని మిత్ర కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులు నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్యా,వైజ్ఞానిక, సైద్ధాంతిక శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక పోరాటాల్లో విద్యార్థులు కీలకంగా వ్యవహరించారని, అదే సమయంలో తెలంగాణ ఉద్యమంలో కూడా వరుసలో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువును కొనసాగిస్తూనే రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ విద్యార్థులను మరోసారి మోసం చేయడానికి బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ మాట్లాడుతూ దేశంలో అందరికీ విద్యపేరుతో కొందరికే పరిమితం చేశారని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణీత్‌గౌడ్, బాషబోయిన సంతోష్, నాయకులు కర్రె భిక్షపతి, మేకల రవి, రామకృష్ణ, రహమాన్, నాగజ్యోతి, రాజు, సత్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి 'కోడ్' ఇబ్బందులు



మాట్లాడుతున్న మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్

వరంగల్ : ఎన్నికల కోడ్‌తో రైతులు, వ్యాపారుల ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగంతో పాటు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్ అన్నారు. గురువారం వరంగల్ మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లకు నిరాకరించారు. కోడ్‌తో ఇబ్బందులు పడుతున్నామంటూ కాంటాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సరుకు విక్రయించిన డబ్బుతో ఇళ్లకు వెళ్తున్న రైతులను తనిఖీల పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. రశీదులు చూపించినా పోలీసులు ఇబ్బంది పెట్టారంటూ పలువురు వ్యాపారులు తెలిపారన్నారు. దీనిపై అధికారులు స్పందించి డబ్బు తరలింపు విషయంలో రైతులకు సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మార్కెట్ అధికారులు హామీ ఇవ్వడంతో కాంటాలు జరిగాయి. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి వేదప్రకాశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.